సాక్షి
శ్రీకాకుళం

గురువారం : 7 : సెప్టెంబర్ : 2023



అలసత్వం..అపాయం

విద్యుత్ ప్రమాదాలు పెరుగుతున్నాయి. కాసింత అలసత్వమే అపాయానికి దారి తీస్తోంది.

- 8లో



శుభ కార్యానికి హాజరై..

శుభకార్యం కోసం వచ్చిన వ్యక్తి ప్రమాద వశాత్తు బిల్డింగ్‌పై నుంచి పడి మృతి చెందారు. శ్రీకాకుళంలో ఘటన జరిగింది.

- 8లో

పలాసలో ఎడతెరిపి లేని వాన

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీతో పాటు పలాస మండల పరిధి పల్లపు, ఉద్దాన ప్రాంతాల్లో బుధవారం మధ్యాహ్నం నుంచి ఎడతెరిపి లేని వాన కురిసింది. దీంతో జంట పట్టణాల్లో రోడ్లు నీటితో నిండిపోయాయి. జనం బయటకు రాకుండా ఇళ్లకే పరిమితమైపోయారు. పలు వివాహ కార్యక్రమాలు, కృష్ణాష్టమి వేడుకలకు ఇబ్బంది ఏర్పడింది.

న్యూస్‌రీల్

లేఅవుట్ నిబంధనలు కీలకం

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రస్తుతం పట్టణాలకు సమీపంలో ఉన్న గ్రామాల్లో లేవుట్‌లు ఏర్పడుతున్నాయని, ఈ లేఅవుట్‌ల ఏర్పాటులో నిబంధనలు తప్పని సరిగా పాటించాలని రిసోర్స్ పర్సన్, డీటీసీ పీఓ ఎస్.కిశోర్‌కుమార్ అన్నారు. పంచాయతీ కార్యదర్శులకు రెండో విడత పునశ్చరణ తరగతుల్లో భాగంగా బుధవారం ఎచ్చెర్ల సాంకేతిక శిక్షణ కేంద్రంలో మూడో రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి సంస్థ ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా లేఅవుట్ నిబంధనలపై కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. రిసోర్సు పర్సన్ మాట్లాడుతూ లేఅవుట్ నిబంధనలు పాటిస్తేనే పంచాయతీలకు ఆదాయంతో పాటు, ప్లాట్లు కొనుగోలుదారులకు భవిష్యత్‌లో ఇబ్బందులు ఉండవని అన్నారు. పక్కాగా జిరాయితీ భూముల్లో రెవెన్యూ శాఖ అనుమతితో లేఅవుట్‌లు వేయాలని అన్నారు. కార్యక్రమంలో రీసోర్సు పర్సన్‌లు ఎస్.సత్యకేశవరావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

'పోలీస్ కేసులు రాజీ చేయాలి'

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాజీ చేసేందుకు వీలైన పోలీస్, ఎక్సైజ్ కేసులు ఈ నెల 9న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షుడు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా సూచించారు. ఆయన బుధవారం తన చాంబర్‌లో పోలీస్, ఎక్సైజ్ శాఖల అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం వల్ల వచ్చే లాభాలను వివరించాలని తెలిపారు. పోలీస్, ఎక్సైజ్ శాఖలు కేసుల పరిష్కారంలో వ్యక్తిగత శ్రద్ధ కనబరచాలన్నారు. సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి ఆర్. సన్యాసినాయుడు, ఏఎస్పీ విఠలేశ్వరరావు, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

12 అడుగుల కింగ్ కోబ్రా హతం

మెళియాపుట్టి: మండలంలోని కరజాడ వరిపంట పొలాల్లో సుమారు 12 అడుగుల కింగ్ కోబ్రాను గ్రామస్తులు హతమార్చారు. బుధవారం ఉదయం పొలానికి వెళ్లిన రైతులకు ఏదో జంతువు చేలో సంచరిస్తున్నట్లు కనిపించింది. వెంటనే గ్రామానికి చెందిన యువకులకు సమాచారం అందించారు. యువకులు దగ్గరగా వెళ్లి చూడగా భారీ కింగ్‌కోబ్రా కనిపించింది. దీంతో దాన్ని వెంటాడి హతమార్చారు.



కరజాడ పంటపొలాల్లో రైతులు హత మార్చిన 12 అడుగుల కింగ్‌కోబ్రా



శ్రీకాకుళంలో బాల గోపాలుడు



శ్రీకాకుళంలో నల్లనయ్యకు పూజలు



నరసన్నపేట: వేషధారణలో కోలాట బృంద సభ్యులు



కాశీబుగ్గ : రాధవేషధారణలో చిన్నారి

వేణుగాన సమ్మోహనం.. వేలి మీది గోవర్ధనం

ఆబాలగోపాలం ఆ గోపాలుని స్మరించి తరించింది. పల్లె రేపల్లెగా మారి యదునందనుని పూజించింది. కృష్ణాష్టమి పర్వదినాన జిల్లా అంతటా నల్లనయ్యకు ప్రత్యేక పూజలు జరిగాయి. వాడవాడనా భేషైన రీతిలో వేషధారణలు కనిపించాయి. చిన్నారులు శ్రీకృష్ణుడి వేషం ధరించి మురిసిపోయారు. బాలికలు గోపికలుగా అలంకరించుకుని అలరించారు.

రేషన్ బండి..
మార్పునకు సాక్ష్యమండి!



టెక్కలి మండలంలో భీంపురం అనే గిరిజన గ్రామం ఉంది. ఇక్కడి గిరిజనులు ఒకప్పుడు రేషన్ తీసుకోవాలంటే కిలోమీటర్ల కొద్దీ నడిచి రేషన్ డీలర్ వద్దకు వచ్చేవారు. ఆయన ఎప్పుడు ఇస్తారో తెలీక రోజుల తరబడి వేచి చూసేవారు. కానీ నేడు వారి ఇళ్ల వద్దకే వాహనం వెళ్లి రేషన్ బియ్యం అందిస్తోంది. ఊరూరా నెలనెలా ఒకనాడు రేషన్‌షాపుల వద్ద కట్టిన క్యూలు ఇంకా ఎవరూ మర్చిపోలేదు. కానీ నేడు రేషన్ బియ్యం ఇంటి వద్దనే అందుతోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన విప్లవాత్మక మార్పుల్లో రేషన్ పంపిణీ ప్రధానమైనది. వాహనాల ద్వారా రేషన్ బియ్యం అందజేస్తుండడంతో 844 మంది నిరుద్యోగులకు ఉపాధి కలుగుతోంది.

- రేషన్ పంపిణీలో విప్లవాత్మక మార్పులు
- ఎండీయూ వాహనాలతో ప్రజలకు మేలు
- వాహనాలతో 844 మంది నిరుద్యోగ యువతకు ఉపాధి

టెక్కలి: క్యూలు లేవు, రేషన్ డీలర్ల చీదరింపులు లేవు, కూలి పనికి వెళ్లకుండా ఆగిపోవాల్సిన అవసరం లేదు, సాంకేతిక లోపాల ఊసే లేదు.. లబ్ధిదారులందరికీ ప్రతి నెలా రేషన్ అందుతోంది. గత ప్రభుత్వంలో లబ్ధిదారుడికి రేషన్ అందించడానికి అడ్డువచ్చిన సవాలక్ష సమస్యల్లో ఒక్కటి కూడా ఇప్పుడు కనిపించడం లేదు. లబ్ధిదారుడి వీధిలోకే వెళ్లి రేషన్ అందజేస్తుండడంపై జనం ఆనందం వ్యక్తం చేస్తున్నారు. టెక్కలి మండలం మేఘవరం పంచాయతీ పరిధి మారుమూల గిరిజన గ్రామాలైన భీంపురం, సరియాపల్లి, కోదండపురం, వంగర, చిన్నభీంపురం, డెప్పూరు, కొత్తూరు, నువ్వుగుడ్డి తదితర గ్రామాలకు చెందిన గిరిజనులంతా ఒకప్పుడు రేషన్ బియ్యం కోసం కిలోమీటర్ల దూరం వచ్చి డీలర్ల వద్ద పడిగాపులు కాసేవారు. రేషన్ కోసం రోజులు తరబడి పనులు మానుకుని వేచి చూసేవారు. ఇప్పుడు వైఎస్ ప్రభుత్వంలో అటువంటి పరిస్థితులు లేకుండా వారి గ్రామాలకే వాహనాల ద్వారా రేషన్ అందజేస్తున్నారు. లబ్ధిదారుడికి ఎలాగైనా రేషన్ అందించాల్సిందేనన్న ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూపకల్పన చేసిన ఇంటి వద్దకే రేషన్ బియ్యం పంపిణీ పథకం విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చింది. ఒక వైపు లబ్ధిదారుల చెంతకే రేషన్ అందడంతో పాటు సుమారు 844 మంది నిరుద్యోగ యువతకు ఎండీయూ వాహనాల ద్వారా ఉపాధి లభించింది.



టెక్కలిలో ఎండీయూ వాహనం ద్వారా లబ్ధిదారుల ఇంటి వద్ద రేషన్ బియ్యం అందజేస్తున్న ఆపరేటర్లు

422 ఎండీయూ వాహనాలతో

జిల్లా వ్యాప్తంగా 30 మండలాల పరిధిలో సుమారు 422 ఎండీయూ వాహనాలతో ప్రతి నెలా రేషన్ పంపిణీ చేస్తున్నారు. ఈ వాహనాల ద్వారా సుమారు 6,69,692 రేషన్ కార్డులకు నెల వారీ క్రమం తప్పకుండా వారి ఇంటి వద్దకే రేషన్ పంపిణీ చేస్తున్నారు. ఎలాంటి సాంకేతిక లోపాలు తలెత్తకుండా లబ్ధిదారులకు ఇబ్బంది కలగకుండా ప్రత్యేక పర్యవేక్షణ చేస్తున్నారు.

రోజుల తరబడి తిరగాల్సిన పనిలేదు



ఒకప్పుడు బియ్యం కోసం రోజులు తరబడి మా గ్రామం నుంచి టెక్కలి వెళ్లాల్సి వచ్చేది. ఎన్నో ఇబ్బందులు పడేవాళ్లం. ఒక్కో నెల రేషన్ బియ్యం దొరికేది కాదు. ఇప్పుడు అలాంటి ఇబ్బందులు లేకుండా నేరుగా మా ఊరికే బియ్యం బండి వస్తోంది. ఇక్కడే రేషన్ బియ్యం తీసుకుంటున్నాం. – ఎం.లక్ష్మమ్మ, రేషన్ లబ్ధిదారాలు, సోమయ్యవలస, టెక్కలి మండలం.

పనులు మానుకునేవాళ్లం



గతంలో ప్రతి నెల రేషన్ బియ్యం కోసం పనులు మానుకునేవాళ్లం. మా ఊరి నుంచి టెక్కలి వెళ్లి రేషన్ బియ్యం తీసుకునేవాళ్లం. వర్షాకాలం ఎన్నో ఇబ్బందులు పడేవాళ్లం. ఇప్పుడు అలాంటి కష్టాలు లేకుండా మా ఊరికే బండి వస్తోంది. మా ఊరిలోనే అందరికీ రేషన్ ఇస్తున్నారు.

– బి.పాపమ్మ, లచ్చన్నపేట, టెక్కలి మండలం.

ఎండీయూతో ఉపాధి దొరికింది

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఎండీయూ వాహనాలతో నాలాంటి ఎంతో మంది నిరుద్యోగ యువతకు ఉపాధి దొరికింది. అంతే కాకుండా ప్రతి నెల రేషన్ పంపిణీ చేస్తున్నపుడు లబ్ధిదారులంతా మా పట్ల ఎంతో గౌరవం చూపుతున్నారు.



– కార్తీక్, ఎండీయూ ఆపరేటర్, టెక్కలి.

అరసవల్లిలో కృష్ణాష్టమి వేడుకలు ప్రారంభం

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధిలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు బుధవారం సాయంత్రం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అనివేటి మండపంలో పది రోజుల పాటు నిర్వహించే ఈ వేడుకల్లో ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ సమక్షంలో అర్చకులు ఇప్పిలి క్షేమేంద్ర శర్మ, రంజిత్ శర్మ, సాందీప్ శర్మ, నేతేటి హరిప్రసాద్ శర్మ తదితరులంతా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈఓ వి.హరిసూర్యప్రకాష్, ఆలయ సిబ్బంది పాల్గొని ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. గురువారం సాయంత్రం స్థానిక కృష్ణాష్టమి మండపం వద్ద చల్లకంబాల ఉత్సవాన్ని నిర్వహించనున్నామని, స్థానికులు, యువతీయువకులు పాల్గొనాలని ఆలయ ఈఓ హరిసూర్యప్రకాష్ తెలియజేశారు.



అనివేటి మండపంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను నిర్వహిస్తున్న అర్చకులు

ప్రతి బుధ, శుక్రవారాల్లో జగనన్నకు చెబుదాం

- కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్



శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రతి బుధ, శుక్రవారాల్లో నిర్దేశించిన మండల ప్రధాన కేంద్రాల్లో జగనన్నకు చెబుదాం(జేకేసీ) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ తెలిపారు. ఈ మేరకు సెప్టెంబర్ మాసం షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈ నెల 8న లావేరు, 13న టెక్కలి, 15న పలాస, 20న రణస్థలం, 22న పాతపట్నం, 27న ఇచ్ఛాపురం, 29న ఆమదాలవలస మండల ప్రధాన కేంద్రాల్లో జేకేసీ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. షెడ్యూల్డ్ మండలాల్లో మండల స్థాయి జేకేసీపై గురించి అన్ని గ్రామాల్లో భారీ ప్రచారం కల్పించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా ఫిర్యాదులపై తక్షణ పరిష్కారానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు బుధవారం జారీ చేసిన ప్రకటనలో కలెక్టర్ వివరించారు. ఇందులో జిల్లా స్థాయి అధికారులతో పాటు మండల స్థాయి అధికారులు భాగస్వామ్యం కానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులను రిజిస్ట్రేషన్ చేయడం, నమోదైన అర్జీలను అదే రోజు జేకేసీ పోర్టల్ నందు ఆయా రెవెన్యూ డివిజనల్ అధికారులు నమోదు చేసి పర్యవేక్షించడం, ఆడిట్, ఫిర్యాదు దారుని స్పందన, ఫిర్యాదుల పునఃపరిశీలన, సంతృప్తి స్థాయి పెంచడం వంటి వాటిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి హాజరయ్యే అధికారులంతా తమ రికార్డులతో సిద్ధం కావాలని సూచించారు.

రక్తదాన శిబిరం ప్రారంభం

శ్రీకాకుళం కల్చరల్: ఆధ్యాత్మికతతో పాటుగా సామాజిక బాధ్యతను కూడా సుందర సత్సంగం నిర్వాహకులు పాటిస్తున్నారని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. స్థానిక డీసీసీబీ కాలనీలోని సుందర సత్సంగం ఆధ్వర్యంలో కృష్ణాష్టమి సందర్భంగా రక్తదాన శిబిరాన్ని మంత్రి ధర్మాన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్సంగం తరపున ఏటా ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం శుభపరిణామమని అన్నారు. మన జిల్లాలో వైద్యానికి అవసరమైన రక్త నిల్వలు లేవని, ఇలాంటి సమయంలొ రక్తదాన శిబిరం నిర్వహించడం ఎంతో గొప్ప విషయమన్నారు.



రక్తదానం శిబిరాన్ని పరిశీలిస్తున్న మంత్రి ధర్మాన

ఆదిత్యుని సన్నిధిలో ఏపీ టూరిజం ఈడీ

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని ఏపీ పర్యాటక శాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) ఏఎల్ మల్‌రెడ్డి బుధవారం సాయంత్రం దర్శించుకున్నారు. తొలిసారిగా అరసవల్లి సందర్శించిన నేపథ్యంలో ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు ఆయనకు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనంతరం గోత్రనామాలతో అర్చక బృందం ప్రత్యేక పూజలు జరిపించారు. వేద పండితులతో వేదాశీర్వచనాన్ని అందజేసిన తర్వాత ఆలయ విశిష్టతను శంకరశర్మ ఆయనకు వివరించారు. కార్యక్రమంలో విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక ఆహ్వానితుడు బెహరా భాస్కరరావు, జిల్లా టూరిజం అధికారి ఎస్.నారాయణరావు, టూరిజం డీఈ స్వామి, ఏఈ సీతారాం, వైఎస్సార్‌సీపీ నేత పేడాడ రమణి తదితరులు పాల్గొన్నారు.



ఆదిత్యుని జ్ఞాపికను మల్‌రెడ్డికి అందజేస్తున్న ఈఓ హరిసూర్యప్రకాష్

9న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలకు షెడ్యూల్ ఖరారైంది. త్వరలో ఏలూరు వేదికగా జరిగే రాష్ట్ర పోటీల్లో పాల్గొనే జిల్లా అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపిక ప్రక్రియను ఈనెల 9వ తేదీన జిల్లాలో నిర్వహించనున్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ (ఆర్ట్స్) కళాశాల మైదానంలో వేదికగా ఈ ఎంపికలు శనివారం ఉదయం 9 గంటలకు మొదలుకానున్నాయి. అండర్–14, 16, 18, 20, 23 ఈ ఐదు వయో విభాగాల్లో బాలబాలికలకు వేరువేరుగా ఎంపిక పోటీలను నిర్వహించనున్నారు. కాగా ఈ ఎంపికల కోసం క్రీడాకారులు గత కొద్దిరోజులుగా క్రీడా మైదానాల్లో కఠోర సాధన చేస్తున్నారు. కొత్త సీజన్‌లో మొదలుకానున్న అథ్లెటిక్స్ సమరానికి యువ, వర్ధమాన, సీనియర్ అథ్లెటిక్స్ క్రీడాకారులంతా సన్నద్ధం కావాలని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొన్న మధుసూదనరావు, ప్రధాన కార్యదర్శి మెంటాడ సాంబమూర్తి పిలుపునిచ్చారు. త్వరలో జరిగే రాష్ట్రపోటీలకు జిల్లా అథ్లెట్స్ ఎంపికలను పూర్తి చేస్తామని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి, అర్హత కలిగిన క్రీడాకారులు తమ జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డుతో ఈనెల 9న ఎంపికలకు హాజరుకావాలని వారు సూచించారు. మరిన్ని వివరాలకు ఎం.సాంబమూర్తి (సెల్: 8500271575)ని సంప్రదించాలని కోరారు.

కొత్తమ్మ తల్లి ఆలయానికి
కొంగొత్త సొబగులు



కొత్తగా నిర్మించిన 5 అంతస్తుల రాజగోపురం

- రూ.2 కోట్లతో ఆలయంలో అభివృద్ధి పనులు
- అమ్మవారి గర్భాలయం పునర్నిర్మాణం పూర్తి
- కొత్తగా ప్రాకార మండపం, ఐదంతస్తుల రాజగోపురం నిర్మాణం
- అక్టోబర్ 17 నుంచి 19 వరకూ ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు

కోటబొమ్మాళి: ఉత్తరాంధ్రుల ఇష్టదైవం కోటబొమ్మాళి కొత్తమ్మ తల్లి ఆలయానికి కొంగొత్త సొబగులు అద్దారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయడంతో రూ.1.60 కోట్ల వ్యయంతో పలు పనులు పూర్తి చేశారు. అమ్మవారి గర్భాలయ పునర్నిర్మాణంతో పాటు, కొత్తగా ప్రాకార మండపం నిర్మాణానికి రూ.కోటి వెచ్చించారు. అలాగే మరో రూ.60 లక్షల నిధులతో ఐదంతస్తుల రాజగోపురం, రక్షణ గోడ పనులు పూర్తి చేశారు. దీంతో అమ్మవారి దర్శనానికి వస్తున్న భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అన్నదాన మండపానికి రూ.50 లక్షల నిధులు మంజూరైనా స్థలం లేకపోవడంతో నిర్మాణం వాయిదా పడింది. దాతలు స్థలం ఇస్తే కొత్తగా మండపం నిర్మాణానికి చర్యలు తీసుకోనున్నట్లు ఆలయ కమిటీ చైర్‌పర్సన్ బోయిన మాధవి, ఈఓ వి.రాధాకృష్ణ తెలిపారు.



పునర్నిర్మించిన అమ్మవారి గర్భాలయం

ఈ ఏడాది అక్టోబర్ 17 నుంచి 19 వరకు కొత్తమ్మ తల్లి ఉత్సవాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో రూ.30 లక్షల అంచనా వ్యయంతో ఉత్సవాలు నిర్వహించడానికి ఆలయ కమిటీ, అధికార యంత్రాంగం భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొత్తపేట జంక్షన్ నుంచి కోటబొమ్మాళి రైతు బజారు వరకూ విద్యుత్ దీపాలు అమర్చనున్నారు. అలాగే ముఖ్యమైన కూడళ్లలో దేవతామూర్తుల విద్యుత్ హోర్డింగులు ఏర్పాటు చేయనున్నారు. జాతర జరిగే మూడు రోజులు సాంస్కృతిక కార్యక్రమాలు, ఎగ్జిబిషన్లను ఏర్పాటు చేస్తున్నారు.

చాలా ఆనందంగా ఉంది

కొత్తమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం నిధులు విడుదల చేయడం సంతోషకరం. గతంలో డబ్బులు లేక పనులు జరగలేదు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. పనులు పూర్తవడంతో భక్తులు ఆనందంగా అమ్మవారి దర్శనం చేసుకుంటున్నారు.

– బోయిన మాధవి, కొత్తమ్మ తల్లి ఆలయ కమిటీ చైర్‌పర్సన్, కోటబొమ్మాళి

స్థల దాతలు ముందుకు రావాలి

కొత్తమ్మతల్లి ఆలయంలో దాదాపు అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. అన్నదాన మంటపానికి నిధులు మంజూరైనా ఆలయ ఆవరణలో తగినంత స్థలం లేక నిర్మించలేపోయాం. ఎవరైనా దాతలు స్థలం ఇస్తే నిర్మిస్తాం.

– వాచకచర్ల రాధాకృష్ణ, కొత్తమ్మ తల్లి ఆలయ ఈఓ, కోటబొమ్మాళి

భక్తులకు ఎంతో మేలు

కొత్తమ్మతల్లి ఆలయంలో అభివృద్ధి పనులు చేపట్టడం చాలా ఆనందంగా ఉంది. భక్తులకు ఎంతో మేలు జరిగింది. గతంలో సరైన సదుపాయాలు లేక భక్తులు ఇబ్బంది పడేవారు.

– యర్రి చిరంజీవి, అమ్మవారి భక్తుడు, కోటబొమ్మాళి

క్లుప్తంగా

త్రుటిలో తప్పిన ప్రమాదం



లక్కవరం బస్‌షెల్టర్ వద్ద సేద తీరుతున్న ప్రయాణికులు

సోంపేట: మండలంలోని లక్కవరం జంక్షన్ వద్ద త్రుటిలో ప్రమాదం తప్పింది. స్థానికులు, ప్రయాణికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బారువ నుంచి సోంపేట వెళ్తున్న ఆటోను ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న వారికి స్వల్ప గాయాలయ్యాయి. చిన్న చిన్న గాయాలతో బయటపడడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

సనాతన ధర్మం వర్ధిల్లాలని నడక యాత్ర



పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ మీదుగా నడకయాత్రలో రితిష్ షేనా

కాశీబుగ్గ: భారత సనాతన ధర్మం వర్ధిల్లాలని కోరుతూ పంజాబ్ రాష్ట్రానికి చెందిన రితిష్ షేనా అనే యువకుడు నడకయాత్ర చేపట్టాడు. ఆల్ ఇండియా ట్రావెలర్ అయిన యువకుడు చార్‌ధామ్ యాత్ర, దేశంలో 12 జ్యోతిర్లింగాలను నడకయాత్రతో చేపడుతున్నాడు. జాతీయ రహదారిపై ఇప్పటి వరకు 6400 కిలోమీటర్లు ప్రయాణించానని, రోజుకు వంద నుంచి నూటాయాభై కిలోమీటర్లు నడుస్తున్నానని తెలిపారు. బుధవారం పలాస-కాశీబుగ్గ జంటపట్టణాల మీదుగా ప్రయాణం కొనసాగించడంతో పలువురు ఆయనకు పలకరించి సెల్ఫీలు తీసుకున్నారు.

'జీఓ నంబర్ 117 వెనక్కి తీసుకోవాలి'



మాట్లాడుతున్న సాయిశ్రీనివాస్

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉపాధ్యాయ పోస్టుల పునర్విభజన జీఓ నంబర్ 117తో విద్యారంగం భ్రష్టు పట్టిపోతుందని, ప్రభుత్వం వెంటనే మేల్కొని ఆ జీఓను వెనక్కి తీసుకోవాలని ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయిశ్రీనివాస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం శ్రీకాకుళం జిల్లాకు వచ్చిన ఆయన రామలక్ష్మణ కూడలి సమీపంలో ఉన్న క్రాంతిభవన్‌లో ఎస్టీయూ జిల్లా శాఖ ముఖ్య ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కొంతమంది ఉన్నతాధికారులు తీసుకుంటున్న చర్యలు, నిర్ణయాలతో రాష్ట్రప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందనే విషయాన్ని ఉన్నత ప్రజాప్రతినిధులు గుర్తించాలన్నారు. సీపీఎస్ రద్దు చేసి పాతపెన్షన్ విధానం పునరుద్ధరించాలని కోరారు. ఆన్‌లైన్ యాప్‌ల బాధ్యతల నిర్వహణకు ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని, అర్హులైన స్కూల్ అసిస్టెంట్లకు జేఎల్స్‌గా పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పేడాడ ప్రభాకరరావు, జిల్లా అధ్యక్ష ప్రధాన, కార్యదర్శులు పడాల తమ్మినాయుడు, ఎస్వీ రమణమూర్తి, జిల్లా నాయకులు బి.రమణ, ఇందిర, రామారావు, శ్రీనివాస్ పట్నాయక్, ఎం.సన్యాసిరావు, శ్రీనివాసరావు, రామకృష్ణ, సాయి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అలసత్వం.. అపాయం

- పెరుగుతున్న విద్యుత్ ప్రమాదాలు
- విద్యుత్ వినియోగంలో నిర్లక్ష్యాన్ని వీడాలని అధికారుల సూచన
- అప్రమత్తతతో మెలిగితే అపాయం ఉండదు



పొందూరు, ఇచ్ఛాపురం రూరల్: వానాకాలం మొదలైనప్పటి నుంచి జిల్లాలో విద్యుత్ ప్రమాదాలు పెరుగుతున్నాయి. చిన్నపాటి నిర్లక్ష్యం కారణంగా బాధితులు ప్రాణాలు కోల్పోవడం, అవయవాలను కోల్పోతుండడంతో ఆయా కుటుంబాలు శోకంలో మునిగిపోతున్నాయి. ఇళ్ల వద్ద, పంట పొలాల్లో విద్యుత్ వినియోగంలో తగిన జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉందని అధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో బోరుబావులు, వాగుల వద్ద విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేసి పంటలు సాగు చేస్తారు. విద్యుత్ వినియోగంలో ఏ చిన్న పొరపాటు జరిగినా..ప్రాణాలు పోయే ప్రమాదం ఉంటుంది. ఈ సమయంలో జాగ్రత్తలు పాటిస్తే మేలని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

జాగ్రత్తలు పాటించాలి

- నిర్మాణాలు జరుపుతున్నప్పుడు పైనుంచి విద్యుత్ వైర్లు వెళుతుంటే విద్యుత్‌శాఖకు సమాచారం ఇవ్వాలి.
- విద్యుత్ వైర్లకు కనీసం మూడు అడుగుల దూరంలో నిర్మాణాలు జరపాలి.
- కరెంటు స్తంభాల వద్ద, వైర్ల నుంచి నిప్పులు రాలుతుంటే విద్యుత్ లైన్‌మెన్‌కు, ఏఈకి తెలియజేయాలి.
- విద్యుత్ వైర్ల కిందనున్న చెట్లను, విద్యుత్ వైర్లకు తాకుతున్న చెట్ల కొమ్మలను ఎక్కరాదు, తాకరాదు. విద్యుత్ వైర్లకు తాకి ఉన్న చెట్ల కొమ్మలను కొట్టవద్దు
- తడి బట్టలతో, తడి చేతులతో విద్యుత్ పరికరాలను ముట్టుకోవద్దు. రిపేర్లు చేయవద్దు.
- విద్యుత్ షాక్‌కు గురవుతున్న వ్యక్తులను నేరుగా చేతులతో తాకరాదు. పొడి కర్ర లేదా విద్యుత్ ప్రవహించని ప్లాస్టిక్ వస్తువులతో షాక్‌నకు గురైన వ్యక్తిని తప్పించాలి.
- విద్యుత్ ప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్నట్లు గమనిస్తే 1912, స్థానిక విద్యుత్ కార్యాలయానికి సమాచారం తెలియజేయాలి.

ఇంటిలో జాగ్రత్తలు తీసుకోవాలిలా..

- ఐఎస్ఐ స్టాండర్డ్ ఉన్న పరికరాలను మాత్రమే వాడాలి.
- కరెంటు వినియోగం తర్వాత వెంటనే స్విచ్‌ను ఆపాలి.
- ఇంటికి ఎర్తింగ్ చేయించుకోవాలి.
- ఇంటిలో వాడుతున్న విద్యుత్ సామగ్రికి సరైన ఓల్టేజి వాడుతున్నారో లేదో చూసుకోవాలి. అప్పుడు ఓవర్ హీటింగ్ సమస్య ఉండదు.

జిల్లాలో జరిగిన విద్యుత్ ప్రమాదాలు..

- పొందూరులోని లక్ష్మీపేట గ్రామంలో సమీపంలో ఆవులను మేపుతున్న విద్యార్థి అనకాపల్లి వెంకటేష్ కరెంటు షాక్‌తో మృతిచెందాడు. మూడేళ్లగా ఖాళీగా ఇంటివైపు ఆవులు వెళ్తుండటంతో కర్రను విసిరాడు. అది ఆవుకు తగిలి ఇంటిపై పడింది. కర్రను తీసేందుకు గోడ ఎక్కడంతో హెచ్‌టీ వైరు తగిలి మృతి చెందాడు.
- పొందూరు మెయిన్ రోడ్డు సిస్టం కళాశాలకు సమీపంలోని చికెన్ దుకాణంపై నుంచి వెళ్తున్న హెచ్‌టీ వైరు నుంచి నిప్పులు కురుస్తుండటంతో గుర్తించిన యువకుడు గొర్లె వసంత కుమార్ చికెన్ దుకాణం సిబ్బందిని అప్రమత్తం చేయబోయి మృతిచెందాడు. హెచ్‌టీ వైరు నుంచి నిప్పులు రావడంతో దాని ఫొటో తీస్తున్న సమయంలో వైరు అతడి మీదే పడి మృతి చెందాడు.
- పొందూరు మండలంలోని ఇల్లయ్యగారిపేట వద్ద వాకింగ్ చేస్తూ యువకుడు కొంచాడ వెంకటరావు కరెంటు షాక్‌కు గురై మృతిచెందాడు. హెచ్‌టీ వైరుకు తాటి ఆకు వేలబడి ఉండటంతో ప్రమాదం జరుగుతుందని గుర్తించి దాన్ని తీసేందుకు ప్రయత్నించడంతో వెంటనే షాక్ కొట్టి మృతి చెందాడు.
- పొందూరు మండలంలోని దళ్లిపేట గ్రామానికి చెందిన పెయ్యల తవిటయ్య కృష్ణాపురం ఆనందాశ్రమం సమీపంలో గొర్రెలను మేపుతూ కరెంటు షాక్‌కు గురై మృతి చెందాడు. విద్యుత్ స్తంభానికి ఉన్న సపోర్టింగ్ వైరును పట్టుకున్న సమయంలో గాలి వీయడంతో హెచ్‌టీ వైరుకు వేలాడుతున్న మరో వైరు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు.
- రాపాక చెందిన ఎలకల రామకృష్ణ బురిడికంచరాంలో గ్రానైట్ ఫ్యాక్టరీలో పనిచేస్తుండగా విద్యుత్‌ను పునరుద్ధరించడంతో మృతిచెందాడు.
- పెనుబర్తిలో పొలం పనిచేస్తుండగా హెచ్‌టీ వైరు తగిలి ఓ రైతు మృతి చెందాడు.
- నరసాపురం గ్రానైట్ ఫ్యాక్టరీలో ఓ వ్యక్తి కరెంటు షాక్‌తో మృతి చెందాడు.
- ఎచ్చెర్ల మండలం ముద్దాడ పంచాయతీ సెగిడిపేటలో బోరు తవ్వుతుండగా హెచ్‌టీ వైర్లుకు తగిలి షార్ట్ సర్క్యూట్‌తో బిమ్ము సొరా, హోడా బాగ్రియాలు అక్కడికక్కడే మృతి చెందారు.

- పోర్టబుల్ హీటర్స్ వాడేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలి.

ప్రమాదం సంభవిస్తే పరిహారం

విద్యుత్ సంస్థలు మూడు రకాల ప్రమాదాలకు మాత్రమే నష్టపరిహారం అందిస్తున్నాయి. మనుషులు, పశువులు మరణించిన తర్వాతనే సాయం అందుతుంది. గాయపడితే పరిహారం అందదు. మనుషులకు రూ.5లక్షలు, పశువులు అయితే పశు వైద్యాధికారి ఇచ్చిన నివేదిక అధారంగా విలువ బట్టి రూ.20 వేలు నుంచి నష్ట పరిహారం చెల్లిస్తారు. ఏదైనా ప్రమాదం జరిగిన స్థలం లోని చిత్రం, పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు, శవ పంచనామా పత్రాలను విద్యుత్ అధికారులకు సమర్పించాలి. పశువుల ఫొటోతో పాటు పశు వైద్యుడి పోస్టుమార్టం నివేదికను విద్యుత్ అధికారులకు అందించాల్సి ఉంటుంది.

అప్రమత్తంగా ఉండాలి

విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలి. తీగలు తెగిపడినా, కిందకు వేలాడినా ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. విద్యుత్ అధికారులకు వెంటనే సమాచారం అందించాలి. ఆన్, ఆఫ్ స్విచ్‌లు వేసే సమయంలో జాగ్రత్తలు ఉండాలి. అత్యవసర సమయాల్లో టోల్ ఫ్రీ నంబర్ 1912కు ఫోన్ చేయ్యాలి. – ఎల్.దైవ ప్రసాద్, పర్యవేక్షక ఇంజినీర్, ఏపీఈపీడీసీఎల్

విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి



దళ్లి రాంబాబు(ఫైల్)

పొందూరు: మండలంలోని దళ్లిపేట గ్రామంలో మంగళవారం రాత్రి జరిగిన విద్యుత్ ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందారు. దళ్లిపేట గ్రామానికి చెందిన దళ్లి రాంబాబు(33) శ్రీకాకుళంలోని శివజ్యోతి మెస్‌లో పనిచేస్తున్నాడు. రాత్రి వరకు పనిచేసి ఇంటికి చేరుకున్నాడు. నిద్రలో టేబుల్ ఫ్యానుకు కాలు తగిలి మీదపడి షాక్ కొట్టింది. దీంతో అతను పెద్దగా కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు లేని ఫ్యాన్ స్విచ్ ఆఫ్ చేశారు. అప్పటికే రాంబాబు అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో ప్రాథమిక చికిత్స కోసం తీసుకెళ్తుండగా తానెం సమీపంలో ప్రాణాలు విడిచాడు. దీంతో మృతదేహాన్ని తిరిగి గ్రామానికి తీసుకువచ్చారు. భార్య జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. గతంలో అతని తండ్రి దళ్లి లక్ష్మణ తాటిచెట్టు కొడుతుండగా మీద పడి మృతి చెందాడు. రాంబాబు మృతితో అతని కుటుంబం రోడ్డున పడింది. రాంబాబుకు భార్య జ్యోతి ఇద్దరు ఆడపిల్లలు, తల్లి పాపయ్యమ్మ ఉన్నారు. వీరంతా కన్నీటిపర్యంతమయ్యారు.

పోలీసులకు గాయాలు

రాంబాబు మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్‌కు తీసుకెళ్తుండగా రోడ్డు ప్రమాదం జరిగింది. హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు, కానిస్టేబుల్ నాగేశ్వరరావులు బైక్‌పై వెళ్తుండగా చిలకపాలెం సమీపంలో పేపర్ వ్యాను ఢీకొట్టింది. దీంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు.

పోక్సో కేసు నమోదు

హిరమండలం: బాలికను వేధిస్తున్న ఓ వ్యక్తిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ జి.నారాయణస్వామి బుధవారం తెలిపారు. హిరమండలం మైత్రీ కాలనీకి చెందిన ఓ బాలిక స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. రెల్లివీధికి చెందిన ఇస్సై శీను అలియాస్ సంజు రోజూ ఆమె వెంట పడుతూ వేధిస్తున్నాడు. దీంతో బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఈ మేరకు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ నారాయణస్వామి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

రణస్థలం: మండలంలోని నెలివాడ జాతీయ రహదారిపై వంతెనపై సోమవారం రాత్రి 9గంటల సమయంలో రోడ్డు ప్రమాదంలో వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు జేఆర్ పురం ఎస్ఐ జి.రాజేష్ తెలిపారు. ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి తొలుత శ్రీకాకుళంలోని రిమ్స్‌కు అక్కడి నుంచి వైజాగ్‌లోని కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. మృతుడి వయసు 35 ఏళ్లు ఉంటాయని, ఎవరికైనా వివరాలు తెలిస్తే జేఆర్ పురం ఎస్ఐ జి. రాజేష్ ఫోన్ నంబర్ 63099 90850కు సమాచారం అందించాలని తెలిపారు.

మొన్న పదోన్నతి.. నిన్న మృతి



తెంబ వాసుదేవు

సోంపేట: మండలంలోని బారువ మేజర్ పంచాయతీ ఈఓగా, సోంపేట మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జి ఈఓపీఆర్డీగా విధులు నిర్వహిస్తున్న తెంబ వాసుదేవు(56) బుధవారం మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం వరకు బారువ మేజర్ పంచాయతీ ఈఓగా విధులు నిర్వహిస్తున్న వాసుదేవు ఈఓపీఆర్డీగా పదోన్నతి పొంది మన్యం జిల్లాకు మంగళవారం బదిలీ అయ్యారు. బుధవారం విధుల్లో చేరాల్సి ఉంది. అయితే అనారోగ్యంతో సోంపేట ప్రైవేటు ఆస్పత్రిలో మంగళవారం చేరారు. చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన భార్య ఏడాది కిందటే మృతి చెందారు. వాసుదేవ్ మృతిపై జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, వైఎస్సార్ సీపీ ఇచ్ఛాపురం సమన్వయకర్త పిరియా సాయిరాజ్, ఎమ్మెల్సీ నర్తురామారావు, ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, జెడ్పీటీసీ తడక యశోద, ఎంపీడీఓ బెందాళం వెంకటరమణ, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, సచివాలయాల సిబ్బంది సంతాపం తెలియజేశారు. గురువారం వాసుదేవు స్వగ్రామం మందస మండలంలోని మూలుపాడు గ్రామంలో అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

శుభ కార్యానికి హాజరై..

- రెండో అంతస్తు నుంచి జారిపడి వ్యక్తి మృతి



రక్తపు మడుగులో కొర్ను నర్సింహులు

శ్రీకాకుళం క్రైమ్ : శుభ కార్యానికి హాజరు కావడానికి వచ్చిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు భవనం రెండో అంతస్తు పై నుంచి పడిపోయి ప్రాణాలు కోల్పోయాడు. శ్రీకాకుళంలో బుధవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి స్థానికులు, రెండో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ కె.లక్ష్మి తెలిపిన వివరాల మేరకు.. ఎల్ఎన్‌పేట మండలం చిన్న కొల్లివలస గ్రామంలో ఆర్అండ్ఆర్ కాలనీలో కొర్ను నర్సింహులు (53) మేస్త్రీగా పనిచేసుకుంటూ జీవిస్తున్నారు. ఈయనకు భార్య, ఇద్దరు వివాహమైన కుమార్తెలు, ఐటీఐ చదివి ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్న కుమారుడు ఉన్నారు. తన బంధువుల వివాహ వేడుకకు హాజరయ్యేందుకు శ్రీకాకుళం డేఅండ్‌నైట్ కూడలి సమీపంలోని వరం రెసిడెన్సీకి వచ్చారు. రెండో అంతస్తులో కల్యాణ మండపం ఉంది. అక్కడ భోజనం ముగించుకుని బయటకు వస్తుండగా ఫోన్ రావడంతో అక్కడే తెరిచి ఉన్న కిటికీ వద్ద మాట్లాడుతూ.. ప్రమాదవశాత్తు వెల్లకిలా వెనుకవైపు తూగి కిందకు పడిపోయాడు. అక్కడే ఉన్న నర్సింహులు తండ్రి సూర్యనారాయణ, బంధువులు చేరే సరికి తల వెనుక బలమైన గాయం తగలి అపస్మారక స్థితిలో కనిపించాడు. వెంటనే ప్రైవేటు అంబులెన్స్‌లో రిమ్స్‌కు తరలించినా ఫలితం లేకపోయింది. నర్సింహులు మృతి చెందాడని వైద్యులు నిర్ధారించడంతో అతని కుమారుడు సతీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.లక్ష్మి తెలిపారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24క్యా. 10గ్రా.)	60,380–00
బంగారం(22క్యా. 10గ్రా.)	55,350–00
వెండి (కిలో)	80,000–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹ 220

అన్నమయ్య కీర్తనలు అనన్య సామాన్యం



మాట్లాడుతున్న తాళ్లపాక హరినారాయణాచార్యులు

నరసన్నపేట: అన్నమాచార్య కీర్తనలు ప్రపంచ ప్రఖ్యాతి పొందాయని, వీటిని ఆలపించడం ద్వారా భక్త కోటికి శుభం కలుగుతుందని తాళ్లపాక అన్నమాచార్య 12వ తరం వారసులు తాళ్లపాక హరినారాయణ చార్యులు అన్నారు. స్థానిక వెంకటేశ్వరాలయంలో లక్ష్మీ నరసింహ కోలాట బృందం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ముందుగా నరసన్నపేట వచ్చిన హరినారాయణ చార్యులుకు శ్రీ వెంకట అన్నమాచార్య సేవా ట్రస్టు జిల్లా కోఆర్డినేటర్ సంతోషి బృందం ఘనంగా స్వగతం పలికింది. ఈ సందర్భంగా వెంకటేశ్వరాలయం వరకూ ఊరేగింపు నిర్వహించారు. దారి పొడుగునా లక్ష్మీ నరసింహ కోలాట బృందం కోలాటాన్ని ప్రదర్శించింది. ఆలయం ప్రాగణంలో నిర్వహించిన కార్యక్రమంలో హరినారాయణా చార్యులు ప్రవచనాలు చేశారు. తిరుమల క్షేత్రానికి అన్నమాచార్యుని ఉన్న అనుబంధాన్ని వివరించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర స్వామి ఆలయ అర్చకులు శ్రీ కృష్ణామాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా కృష్ణాష్టమి

నందిగాం మండలం కవిటి అగ్రహారం గ్రామంలో బుధవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. యాదవ సంక్షేమ సంఘ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, ఉట్టికొట్టడం, బలప్రదర్శన పోటీలు, వివిధ ప్రాంతాలకు చెందిన సాంస్కృతిక పోటీలు ఆకట్టుకున్నాయి. - నందిగాం/కాశీబుగ్గ



వెయిట్ లిఫ్టింగ్ పోటీలు



ఏపీటీలో ప్రసిద్ధిగాంచిన అంజాట



ఎర్రజెండా అంటూ యువకుడి నృత్యం



కృష్ణుడు, గోపికల ఆటపాటలు



తప్పెటగుళ్ల ప్రదర్శనలో యువకులు

అక్టోబర్ 12న ఏపీ రైతు సంఘం జిల్లా మహాసభ




మాట్లాడుతున్న బుడితి అప్పలనాయుడు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం 12వ జిల్లా మహాసభను అక్టోబర్ 12న నిర్వహించనున్నామని సంఘ ఉమ్మడి జిల్లాల కార్యదర్శి బుడితి అప్పలనాయుడు తెలిపారు. ఈ మేరకు బుధవారం రామలక్ష్మణ కూడలిలో గల క్రాంతి భవన్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ ఈ సమావేశంలో రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై చర్చించి కేంద్ర ప్రభుత్వంపై ఉద్యమానికి శ్రీకారం చుడతామన్నారు. జిల్లాలో వంశధార, నాగావళి ప్రధాన నదులు ఉన్నప్పటికీ శివారు ప్రాంతాల్లో ఉన్న పలాస వజ్రపుకొత్తూరు, నందిగామ తదితర మండలాలకు నేటికీ సాగునీరు అందటం లేదంటే ఇరిగేషన్ అధికారులు ఎంత నిర్లక్ష్యం వహిస్తున్నారో తెలుస్తుందన్నారు.

జిల్లా కమిటీ నియామకం..

సంఘం జిల్లా కమిటీని ఐదు మందితో ఎన్నుకున్నారు. జిల్లా కన్వీనర్‌గా గుడ్ల రామకృష్ణ, సభ్యులుగా పంచరెడ్డి అప్పారావు, తిమిరి భుజంగరావు, చిక్కాల గోవిందరావు, నిమ్మడ కృష్ణను ఎన్నుకోవడం జరిగింది. పార్టీ జిల్లా కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి, జిల్లా కన్వీనర్ గుడ్ల రామకృష్ణ, చిక్కాల గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

మేను పరవశిం'చేను'



పచ్చగా ఎదిగిన పైరు కళ్లకు ఇంపుగా కనిపిస్తోంది. ఇచ్ఛాపురం మండలం రత్తకన్న, మశాఖపురం పంట పొలాలు ఇలా పచ్చగా కళకళలాడుతున్నాయి. - ఇచ్ఛాపురం రూరల్

గ్యాస్ సిలిండర్ లీక్.. తప్పిన ప్రమాదం

శ్రీకాకుళం క్రైమ్ : శ్రీకాకుళంలోని పాత బస్టాండ్ సమీపంలో బుధవారం గ్యాస్ సిలిండర్ లీకైంది. అయితే సిబ్బంది సకాలంలో స్పందించడంతో ప్రమాదం తప్పింది. స్థానికులు, షాపు యజమాని రఫీ తెలిపిన వివరాల ప్రకారం.. సబ్ డివిజనల్ పోలీసు కేంద్రం పక్కన షాపింగ్ కాంప్లెక్స్‌లో ఉన్న బిస్మిల్లా బిర్యానీ సెంటర్ దుకాణానికి కమర్షియల్ గ్యాస్ సిలిండర్ భారత్ గ్యాస్ డెలివరీ బాయ్ తీసుకొచ్చాడు. ఈ క్రమంలో దుకాణ యజమానికి సిలిండర్‌ను పరీక్షించి చూపించేందుకు డెలివరీ బాయ్ మీద క్యాప్ తీయగా ఒక్కసారిగా గ్యాస్ ఎక్కువ మొత్తంలో లీకైంది. పక్కనే కాలుతున్న పొయ్యి ఉండటంతో అక్కడే ఉన్న జనం ప్రాణభయంతో పరుగులు తీశారు. డెలివరీ బాయ్ రిస్క్ ఉన్నా చాకచక్యంగా సిలిండర్‌పై క్యాప్ పెట్టడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ఘటన జరిగిన పరిసరాల్లోనే పెట్రోల్ బంక్ ఉండటంతో అక్కడికొచ్చిన వాహనదారులు సైతం తమ ద్విచక్రవాహనాలను వదిలి దూరంగా వెళ్లిపోయారు. బంక్ నిర్వాహకులు సైతం అప్రమత్తమై కాసేపు ఆపేయడంతో పెను ప్రమాదం తప్పింది.